## వాడవాడలా కొలువు దీరిన గణపయ్యలు



కొలువుతీరిన గణపయ్యలు

**బత్తలపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త**

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండలంలోని ప్రతి గ్రామంలోనూ వాడవాడలా. గణపయ్యలను కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం మండలంలోని ప్రతి గ్రామంలోనూ వినాయక చవితి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 150కు పైగా విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం నుండే మండపాలలో వినాయకున్ని కొలువుదీర్చిన వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ విగ్రహాలను





ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు మండపాలకు చేరుకుని వినాయకులకు పూజలు చేశారు. మండపాలు వద్ద చేపట్టిన సాంస్క ృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో పండుగ ఉత్సాహం అంబరాన్ని తాకాయి. ఆయా గ్రామాల్లో నిర్వహించిన వేడుకలలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రమే కొందరు వినాయకున్ని సమీపంలోని చెరువుల్లోనూ, నదుల్లోనూ నిమజ్జనం చేశారు. మరికొందరు రామాపురం వద్దనున్న చిత్రావతి నదిలో నిమజ్జనం చేశారు. ఇదిలా ఉండగా బత్తలపల్లి ఎస్ఐ. సోమశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు మండపాల వద్దకు చేరుకుని వివిధ అంశాలపై తగు జాగ్రత్తలు వివరించారు.

## జాతీయ రహదారిలో కారు, ఆటో ఢీ

**-ఆటో డ్రైవర్‌కు తీవ్ర, కారు యజమానికి స్వల్ప గాయాలు**







గాయపడిన ఆటో డ్రైవర్ సాయికుమార్, చికిత్స పొందుతున్న భీమరెడ్డి

**ఉరవకొండ, ఆగస్టు 28 ప్రభాతవార్త**

మండల పరిధిలోని పెన్నహోబిళ క్షేత్రం సమీపంలో అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో బుధవారం మధ్యాన్నం కారు, ఆటో ఢీకొనడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మూలగిరిపల్లికు చెందిన సాయికుమార్ తీవ్రంగా గాయపడగా కారు యజమాని భీమరెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. సిందనూరుకు చెందిన భీమిరెడ్డి కుటుంబం తిరుపతిలో శ్రీవారి దర్శించుకొని కారులో తిరిగి వెళుతుండగా ఉరవకొండ మండలం మూలగిరిపల్లి గ్రామానికి చెందిన ఆటో ఎదురెదురుగా పెన్నహోబిలం సమీపంలో బలంగా ఢీకొన్నాయి. దీంతో ఆటో డ్రైవర్ సాయికుమార్ కాళ్లకు తీవ్ర గాయాలుకాగా, భీమరెడ్డి కారు అద్దాలు, ముందుభాగం పగిలిపోయి ఆయన గాయపడ్డారు. ఆటో డ్రైవర్ సాయికుమార్‌ను హైవే అంబులెన్స్‌లో చికిత్స కోసం అనంతపురానికి తరలించగా, భీమరెడ్డిను 108లో ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనపై ఆరా తీస్తున్నారు.

లంబోదర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో

## వినాయకుడికి 61 కేజీల భారీ లడ్డు..!





వినాయకుడి విగ్రహం ముందు భారీ లడ్డును పెట్టి పూజలు చేసిన దృశ్యం

**ఉరవకొండ, ఆగస్టు 28 ప్రభాతవార్త**

పట్టణంలోని ఇందిరానగర్ సమీపంలో లంబోదర ఉత్సవ సమితి వినాయకుడివద్ద 61 కేజీల భారీ లడ్డు ప్రసాదాన్ని ఏర్పాటు చేయగా అందరినీ ఆకర్షిస్తోంది. ఉరవకొండ చరిత్రలో తొలిసారి ఇంత భారీ లడ్డు ప్రసాదం ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం. ఈక్రమంలో బుధవారం ఉదయం వినాయక చవితి పర్వదినం రోజు భారీ లడ్డుకు స్థానిక గవిమఠ సంస్థానంలోని గవి సిద్దేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పల్లకీలో కొలుదుదీర్చి పట్టణ వీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగింపు నిర్వహించిన అనంతరం వినాయక విగ్రహంవద్ద పెట్టి పూజలు నిర్వహించారు.

## అమరవీరులకు ఘన నివాళులు



నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు.

**సోమందేపల్లి ఆగస్టు 28 ప్రభాతవార్త.**

మండలంలోని నేడు సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మాబు అధ్యక్షతన గురువారం విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించడం జరిగింది. నాయకులు విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తి తో రాబోవు కాలంలో స్మార్ట్ మీటర్లు , సర్దుబాటు మరియు ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం వినియోగదారులకు ఆర్థిక భారాల మోపుతూ అంబానీ , ఆదానిలకు ఊడిగం చేసే విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలను భాగస్వామ్యం తో మరో బషీర్బాగ్ లాంటి పోరాటాన్ని కొనసాగించడానికి వెనకాడబోమని వామపక్ష పార్టీల పిలుపుమేరకు విద్యుత్ అమరవీరుల ప్రాణ త్యాగాల సాక్షిగా ప్రతినబూనారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో చెప్పిన విధంగా ఇచ్చిన మాటకు కట్టుబడి స్మార్ట్ మీటర్లను రద్దు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు లక్ష్మీ నారాయణ హనుమయ్య, కొండా వెంకటేశులు, మాజీ వార్డ్ మెంబర్ వెంకటేశులు, కెవిపిఎస్ వెంకటేశులు, ఈడిగ రామకృష్ణ, రవి, ఈడిగ నాగ రాజు, బెస్తకిష్టప్ప, కుమ్మరి కిష్టప్ప, శ్రీనివాసులు, కేతగాన్ చెరువు, రామాంజనేయులు, మాలగోవిందప్ప, చేనేత కార్మిక సంఘం నాయకులు నేసే నాగరాజు, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక సెలవులో లక్ష్మినరసింహస్వామి ఆలయ ఈవో

**ఉరవకొండ, ఆగస్టు 28 ప్రభాతవార్త**

ఉరవకొండ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆయన గురువారం 28వ తేదీ నుంచి 2 నెలలుపాటు వ్యక్తిగత కారణాలతో సెలవు కోరుతూ దేవాదాయ కమీషనర్, ఆర్‌జేసీ, జిల్లా ఏసీకు లేఖలు పంపారు. కాగా సాకే రమేష్‌బాబు గత ఏడాది సెప్టెంబర్ 27న ఇక్కడ ఈవోగా బాధ్యతలు చేపట్టగా ఏడాది కూడా పూర్తీ కాకుండానే ఆయన దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఈవో దీర్ఘకాలిక సెలవు పెట్టడానికి ఉన్నతాధికారుల ఒత్తిడులా లేక రాజకీయ కారణాలు ఉన్నాయా అన్నది తెలియాల్సి ఉంది.

## బాలింతల ఇళ్ల ముందు మొక్కలు నాటిన సిడిపిఓ



మొక్కలు నాటుతున్న సిడిపిఓ

**అగళి, ఆగస్టు 28 ప్రభాతవార్త**

గురువారం బేటి బచావో, బేటీ పడావోలో భాగంగా సిడిపిఓ నాగమల్లేశ్వరి ముఖ్య అతిథిగా కార్యక్రమానికి హాజరయ్యారు. అప్పుడే పుట్టిన ఆడబిడ్డ ఆరు నెలల్లోపు ఉన్న ఆడ పిల్లలు ఇంటి దగ్గర ఒక పండ్ల మొక్కను నాటారు. సిడిపిఓ నాగమల్లేశ్వరి, సూపర్‌వైజర్ లీలావతి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ మొక్క ఆడ పిల్లల పేరుతో నాటించారు. అగళి 3వ అంగన్వాడి కేంద్రంలోని అంగన్వాడి టీచర్ చర్చా సమావేశాన్ని నిర్వహించారు. ప్రీ స్కూల్ పిల్లల బరువు, ఎత్తు విషయాలను సేకరించాలని అధికారులు తెలిపారు. అంగన్వాడి టీచర్లు అందరూ తప్పకుండా విధులకు వేలకు హాజరు కావాలని సూచించారు. మొక్కలునాటే కార్యక్రమం విజయవంతం కావడంతో సంతోషించారు.

## గణేష్ మండపాలకు విరాళాలు అందజేత



విరాళం అందజేస్తున్న మనోజ్ కుమార్‌రెడ్డి

**తాడిమర్రి ఆగస్టు 28 (ప్రభాతవార్త)**

వినాయక చవితి వేడుకల సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ డిసిఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి కుమారుడు యువ నాయకులు తాడిమర్రి మనోజ్ కుమార్ రెడ్డి 45 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. మండల కేంద్రంలో 8 మండపాలకు, మరియు తిరుమలాపురం (మోదుగులకుంట) ఎస్సీ కాలనీ లో ఏర్పాటు చేసిన ఒక మండపానికి కలిపి ఒక్కొక్క మండపానికి 5 వేల రూపాయలు చొప్పున 45 వేల రూపాయలు సంబంధిత వినాయక ఉత్సవ సమితి సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా యువ నాయకులు తాడిమర్రి మనోజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించు కోవాలని, అలాగే ఆ వినాయకుడి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా సుఖ సంతోషాలతో జీవించాలన్న ఉద్దేశంతో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు తమ వంతు సహాయంగా విరాళాలను అందజేయడం జరిగిందని అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా తమపై నమ్మకం విశ్వాసం కలిగిన ప్రజలకు తమ కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు.

## న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా




ర్యాలీ నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

**పావగడ, ఆగస్టు 28 ప్రభాతవార్త**

పావగడ తాలూకాలోని దవడబెట్ట గ్రామంలో లాయర్ సుధాకర్ పై దాడి చేసిన సంఘటనను ఖండిస్తూ గురువారం పావగడ పట్టణంలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక కోర్టు ఆవరణం నుంచి ప్రారంభమై శనిమహాత్మ సర్కిల్ వరకు చేరుకొని రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ర్యాలీలో పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు ధర్నాను ఉద్దేశించి న్యాయవాదులు మాట్లాడుతూ.. దవడబెట్ట గ్రామంలో న్యాయవాది సుధాకర్‌పై 20 మంది గుంపుగా దాడి చేసి తీవ్రంగా గాయపరచారని పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి దాడి చేసిన వారితో పాటు గాయపడిన సుధాకర్ పై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం శోచనీయమని తెలిపారు. పోలీసులు బాధితుల పట్ల పనిచేయకుండా రాజకీయ పలుకుబడి ఉన్న వారి వైపు పనిచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పావగడ సిఐ సురేష్ పని తీరు సరిగా లేదని డిఎస్పి మంజునాథ్ ఎస్పీ అశోక్‌లు కళ్ళకు గంతులు కట్టుకొని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ అసమర్థ సిఐ సురేష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ వరదరాజుకు అందజేశారు. ఈ ధర్నాలో తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శేష నందన్, నాగేష్, అక్కులప్ప, వెంకటస్వామి, మల్లికార్జున, జయసింహ, టీఎన్ పేట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు కనబడకుండా పాత మసీదు వెనక వర్షపు నీరు



రోడ్డుపై నీళ్లు నిలచిన దృశ్యం

**అమరాపురం ఆగస్టు 28 ప్రభాత వార్త**

మండల కేంద్రమైన అమరాపురం లోని పాత మసీదు వెనకాల ఉన్న రోడ్డుపై వర్షపు నీరు నిలబడి ఉండడంతో పాదాచారులు మరియు వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వర్షం ఎడతెరపి కురుస్తుండడంతో రోడ్డుపైనే ఎక్కువ నీళ్లు నిలబడి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నట్లు చుట్టుపక్కల ఉన్న ఇండ్ల వాళ్ళు తెలిపారు. సంబంధిత అధికారులకు అనేకసార్లు చెప్పిన కూడా పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై నీళ్లు నిలువ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# వాడవాడలా కొలువుదీరిన బొజ్జ గణపయ్యలు

**-ఆనందోత్సవాల మధ్య వినాయక చవితి పర్వదినం -ఆకట్టుకొంటున్న పూసలు, ఆర్గానిక్ బియ్యం వినాయకులు**



9 రకాల ఆర్గానిక్ బియ్యంతో తయారు చేసిన వినాయకుడు



అంబేద్కర్ నగర్‌లోని వరసిద్ధి వినాయకుడు

**ఉరవకొండ, ఆగస్టు 28 ప్రభాతవార్త**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంతోపాటు, మండలంలోని గ్రామ గ్రామాల్లో వివిధ ఆకృతుల్లో బొజ్జగణపయ్యలు కొలువుదీరారు. బుధవారం ఉదయం పండుగరోజు ట్రాక్టర్లు, వివిధ వాహనాల్లో డప్పువాయిద్యాలు, మేళతాళాల మధ్య బాణాసంచా పేలుస్తూ, 'జైబోలో గణేష్ మహారాజ్‌కి' అంటూ రంగులు చల్లుకొంటూ వైభవంగా ఊరేగింపు నిర్వహించి విగ్రహాలను శోభాయమానంగా తీర్చిదిద్ది ఏర్పాటు చేసిన మండపాలకు తీసుకెళ్లి కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. పట్టణంలో 100 నుండి దాదాపు 150 ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తుండగా ప్రతి గ్రామంలోనూ ఐదు నుండి పది వరకు విగ్రహాలు కొలువుదీరినట్లు తెలుస్తోంది. కాగా వివిధ రూపాల్లో ఆకర్షణీయంగా తయారు చేసిన వినాయక విగ్రహాలు అందరిని ఆకట్టుకొంటున్నాయి. పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో పర్యావరణ హితంకోరి నెలలుపాటు కష్టపడి తయారు చేసిన 9 రకాల ఆర్గానిక్ బియ్యం వినాయకుడు, వరసిద్ధి వినాయకుడు, పురాతన శివాలయంను సెట్టింగ్‌లో కొలువుదీరిన వినాయకుడు, అయ్యప్పస్వామి ఆలయంలో ముందు ముత్యాలను తలపించే పూసలతో తయారు చేసిన వినాయకుడు, మైలారంపల్లిలో ఆకులు, పూలు, పండ్లతో తయారు చేసిన హరిత వినాయకుడు, పాతపేటలోని వరసిద్ధి వినాయక ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన గంట వినాయకుడు అందరినీ ఆకరి ్షస్తున్నాడు. అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ బి.మహానంది ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా 3వ రోజు శుక్రవారం, 5వ రోజు ఆదివారాల్లో దాదాపు అన్ని విగ్రహాలను నిమజ్జనానికి తరలించనున్నట్లు సమాచారం.

## పంటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం



పంట సాగు పై రైతులకు సూచన అందిస్తున్న వ్యవసాయ అధికారులు

**ధర్మవరం రూరల్ ఆగస్టు 28 ప్రభాతవార్త**

మండల పరిధిలోని కుణుతూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం మండల వ్యవసాయ అధికారి ముస్తఫా ఏర్పాటు చేసిన రైతుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్యసాయి జిల్లా వనరుల కేంద్రం ఉప వ్యవసాయ సంచాలకులు శ్రీరామ్ నాయక్ ధర్మవరం సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో అధికారులు మాట్లాడుతూ ప్రధాన పంటలైనటువంటి వరి ,వేరుశనగ కందులు సాగులో తీసుకోవాల్సి న జాగ్రత్తలు రైతులకు అధికారులు సూచించడం జరిగింది. కంది పంట పూత దశలో వేప నూనె తప్పనిసరిగా పిచిరారీ చేసుకోవాలని వరి పంటలో కాలిబాటలు వదులుకోవాలని జిప్సం ఎకరాకు నాలుగు బస్తాలు పూత ఊడలు దిగేదశలో వేయాలని సూచించారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని కౌలుకు సాగు చేస్తున్న రైతులు తమ సమీపంలోని సచివాలయంలోని రైతు సేవ కేంద్ర సిబ్బంది మరియు రెవిన్యూ అధికారిని సంప్రదించి సి సి ఆర్ సి కార్డులు తీసుకోవాలని సూచనలు అందించారు.

## అర్హత ఉన్న దివ్యాంగులకు నోటీసులు జారీ చేసిన అధికారులు

**- ఇబ్బందులు పడుతున్న దివ్యాంగులు**



కవిత, మానసిక వికలాంగురాలు

**కనగానపల్లి ఆగస్టు 28 ప్రభాతవార్త**

ఎప్పటినుండో వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు యధావిధిగా వచ్చేవి కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం తర్వాత వృద్ధులకు, దివ్యాంగులకు ప్రభుత్వం పింఛన్ వెరిఫికేషన్ పేరుతో అధికారులు వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో సచివాలయం చుట్టూ అలాగే మండల అధికారులు చుట్టూ దివ్యాంగుల తో పాటు వారి తల్లిదండ్రులు ప్రదక్షిణలు చేస్తున్నారు. భానుకోట గ్రామం ఎస్సీ కాలనీ చెందిన గోవిందు కూతురు కవిత పుట్టుకతోనే మానసిక దివ్యాంగురాలు ఈమెకు 75 వికలత్వం ఉందని డాక్టర్లు ధ్రువీకరించారు. అయినప్పటికీ ఆమె కూడా మండల అధికారులు నోటీస్ జారీ చేయడంతో వారు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో కోసం పడి కాపులు కాశారు. రెండు రోజుల్లో సెప్టెంబర్ ఒకటో తేదీ తన కూతురికి పింఛన్ వస్తుందో రాదో అని తండ్రి గోవిందప్ప దిగాలు చెందుతున్నాడు. వైకల్యం వారికి శాపం గా మారిందా వైకల్యం ఉన్నప్పటికీ అధికారులు నోటీసులు జారీ చేయడం పై వృద్ధులు దివ్యాంగులు వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమలాంటి వారిపై కనికరం చూపించి తమకు యధావిధిగా పింఛన్లు అందే విధంగా చూడాలని వారు కోరుతున్నారు.

## ఘనంగా వినాయక చవితి వేడుకలు

**- చవితి వేడుకలకు ముఖ్య అతిథిగా జడ్పిటిసి**

**అగళి, ఆగస్టు 28 ప్రభాతవార్త**



గణపతి వేడుకల్లో పాల్గొన్న జడ్పిటిసి

గణపతి చతుర్తిని పురస్కరించుకుని మండలంలోని పల్లెపల్లెల్లో వాడవాడల్లో గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన అగళి బవసన గుడితోపాటు, అగళి బోయ వీధిలో చిన్నారులు గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారు. వారే టెంకాయ గెరలతోపాటు, మ ఆమిడి, ఆరటి తోరణాలతో చిన్న మంటపాలను ఏర్పాటు చేసి విగ్రహాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా అగళి హరిజన వాడ, మెయిన్ బజార్, చాకలి వీధుల్లో సైతం బొజ్జగణపయ్యను ఏర్పాటు చేశారు. మండలంలో ఉన్న 50 గ్రామాల్లో గణపతులను ఏర్పాటు చేసుకున్నారు. బొజ్జగణపయ్యకు ఇష్టమైన వంటకాలను చేసి నైవేద్యంగా పెట్టారు. ముఖ్యంగా కుడాలు, రవ్వ ఉండలు, ఇతర తీపి పదార్థాలను చేసి ముందుగా గణపయ్యకు నైవేద్యాన్ని సమర్పించారు. అగళి బోయ వీధిలో చిన్నారులే గణపతి విగ్రహాన్ని పెట్టి పూజలు నిర్వహించారు. సదరు చిన్నారులు ఏర్పాటు చేసిన గణపతి చిన్న మంటపానికి జడ్పిటిసి ఉమేష్ హాజరై గణపతి ఆశీర్వాదాన్ని పొందారు. మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలతో కార్యక్రమం ముగిసింది.

## ఎల్,ఆర్,ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**కిరికెర పంచాయతీ కార్యదర్శి నారాయణ**

**హిందూపురం టౌన్ ఆగస్టు 28 ప్రభాతవార్త**

లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) ను కిరికెర పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి నారాయణ తెలిపారు. జులై 262025 నుండి అక్టోబర్ 252025 లోపు రెగ్యులరైజేషన్ పథకాన్ని సద్వినియోగం తీసుకోవాలని తెలిపారు. ఒక ఎకరం లేఅవుట్ కు 10 సెంట్లు పంచాయతీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సి ఉంటుంది, ప్రభుత్వ నిబంధనల మేరకే లేఅవుట్లు వేయాలని అనధికారికంగా లేఅవుట్లు వేస్తే వాటిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులతో లేవట్ల నిర్మించుకుంటే టాక్స్ 14 శాతానికి బదులుగా రెగ్యులరైజేషన్ చేసుకుంటే ట్యాక్స్ ఏడు శాతం చెల్లిస్తే సరిపోతుందని అన్నారు. వ్యాపారులు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి నారాయణ కోరారు.

## ఘనంగా వినాయకచవితి ఉత్సవాలు





కొలువుతీరిన గణనాథులు

**యాడికి, ఆగస్టు 28, (ప్రభాత వార్త)**

పల్లెల్లో కూడా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు ఉత్సాహ బరితంగా వినాయక ఉత్సవ ప్రతిమలు నెలకొల్పారు. పల్లెల్లో కోలన్నలో, భజనలు , ఇతర శాశ్వత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ పనుల్లో అలిసిపోయినా రాత్రిపూట వినాయక విగ్రహ ప్రతిమల వద్ద నిర్వహించే సాంస్క ృతిక కార్యక్రమాలను తిలకించి ఆనందానికి గురవుతున్నారు.. యాడికి మండలం వి కొట్టాలపల్లి గ్రామంలో ఈశ్వరుని గుడి వద్ద, కృష్ణుని గుడి వద్ద భక్తులు ఏర్పాటుచేసిన వినాయక విగ్రహ ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు.. ఈ సందర్భంగా కొట్టాలపల్లిలో గురువారం రాత్రి నిర్వహించిన కులుకుబజన కార్యక్రమం ఆకట్టుకుంది..గురువు బాల కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిష్యబృందం కులుకు భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

## సాదుశేఖర్‌కు బళ్లారి రాఘవ జాతీయ అవార్డు

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 28, (ప్రభాత వార్త)**



సాదు రాజశేఖర్

ప్రముఖ కళాకారుడు సాదురాజశేఖర్‌కు బళ్లారి రాఘవ జాతీయ అవార్డు దక్కింది. అనంతపురం జిల్లా యాడికి గ్రామానికి చెందిన సాదు శేఖర్ ప్రస్తుతం అనంతపురంలో నివాసం ఉంటున్నారూ.. రాజశేఖర్ విద్యార్థి దశమించే నాటకాలు వేస్తూ మంచి ప్రతిభ కనపరిస్తూ వచ్చారు. ముఖ్యంగా మాయల పకీరు వేషధారణలో రాణిస్తూ వచ్చారు. సాధు శేఖర్ కు బళ్లారి రాఘవ అవార్డు రావడం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాధు శేఖర్ (మాయల ఫకీరు) కు హృదయ పూర్వక అభినందనలు . అనంతపురం జిల్లా రంగస్థల ప్రముఖ కళాకారుడు సాధు శేఖర్ బాలనాగమ్మ లోని మాయల ఫకీరు నటన, ముఖ్యంగా ఆ నవ్వు మూడు దశాబ్దాలకు పైగా జిల్లా ప్రజల చెవ్వుల్లో మారుమ్రోగుతూనేవుంది. ఆయన నవ్వు కోసమే గ్రామాల నుండి ఎద్దుల బండ్లు కట్టుకుని డ్రామా కోసం వచ్చిన రోజులు వున్నాయి. కష్టాల కళాకారుడు, కల్మషం లేని కళాకారుడు. ఎప్పుడూ నవ్వుతూ పలకరించే శేఖర్ నాకు ఆత్మీయ మిత్రుడు అని, లలిత కళా పరిషత్ కార్యదర్శి పద్మజ ద్వారా అనేక ప్రజా కళా ఉత్సవాలకు జడ్జి గా వ్యవహరించి ఆబాల గోపాలం అభిమానాన్ని పొందాడు అని చెప్పారు. బళ్ళారి రాఘవ జాతీయ అవార్డు కు ఆయన ఎంపిక కావడం జిల్లా కళామతల్లికి అందిన గౌరవం అని రాంభూపాల్ అభిప్రాయపడ్డారు.

## పాడుబడ్డ బంగ్లాను తలపిస్తున్న సచివాలయం



పాడుబడ్డ బంగ్లాను తలపిస్తున్న 17వ సచివాలయం

**గుంతకల్లు, ఆగస్టు 26 ప్రభాతవార్త**



పట్టణంలోని వాల్మీకి విగ్రహం వద్ద వున్న 17వ సచివాలయం పాడుబడ్డ బంగ్లాను తలపిస్తోంది. కార్యాలయ పరిసర ప్రాంతమంతా చెట్ల ఆకులు, పక్షుల మల విసర్జన, చెత్తాచెదారంతో నిండిపోయింది. అలాగే కార్యాలయం ముందు కూడా శుభ్రం చేయకపోవడంతో అధ్వానంగా దర్శనమిస్తోంది. దీంతో పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సూటు బూటు వేసుకుంటే సరిపోదు, కార్యాలయ పరిసరాలను కూడా పరిశుభ్రంగా వుంచుకోవాలని చర్చించుకుంటున్నారు. అయినా సిబ్బంది మాత్రం నిస్సిగ్గుగా ఏమాత్రం పట్టించుకోకుండా అలాగే వదిలేశారు. గురువారం కార్యాలయాన్ని సందర్శించిన సిపిఐ నాయకులు వీరభద్రస్వామి అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యమే కార్యాలయం ఇలా వుండడానికి కారణమని ఆయన పేర్కొన్నారు.

## పలు గణనాథుని మండపాలకు లడ్డు ప్రధానం

**రొద్దం. ఆగస్టు 28 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన రొద్దంలో వెలసిన 11 గణనాథుని మండపాల్లో దివంగత నీరుగంటి రామకృష్ణ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సహకార సంఘం అధ్యక్షుడు వీరాంజనేయులు బంధువులు రామ్మోహన్ చంద్రశేఖర్ సురేష్ వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఉదయాన్నే లడ్డు ప్రసాదం పూజకు విచ్చేసిన గ్రామస్తులకు భక్తులకు అందజేయడం జరిగింది ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో 21 అడుగుల మట్టి వినాయకుని కమిటీ సభ్యులు రవి పవన్ వేణు సి రామాంజనేయులు నాగరాజు ఎం.హెచ్ రామాంజనేయులు నెట్టెం రామాంజనేయులు తిప్పేస్వామి రాజా నాయకులు చిన్నపయ్య తిరుపాల్నాయుడు సిద్దన్న రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

06ATP28_06ATP28.qxd 28-08-2025 PM 11:38 Page 1



## కుప్పం చేసుకున్న పుణ్యం ఏమిటి..? కళ్యాణదుర్గం చేసుకున్న పాపం ఏమిటి..?

- ఆగిపోయిన కుందుర్పి బ్రాంచ్ కెనాల్ కాలువల నిర్మాణంపై ఘాటుగా స్పందించిన వైసీపీ సమన్వయకర్త తలారి రంగయ్య



కుందుర్పి మండలం మహంతాపురం గ్రామ సమీపంలో బిటిపి ఆగిపోయిన కాలువల వద్ద పాదయాత్ర నిర్వహిస్తున్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం, ఆగస్టు 28 ప్రభాతవార్త

హంద్రీనీవా సుజల స్రవంతి నీటిని కేవలం నాలుగు మాసాల వ్యవధిలోనే వందల కిలోమీటర్లు కాలువల లైనింగ్ పనులు పూర్తి చేసి కుప్పంకు నీళ్లు తీసుకు వెళ్లడం ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రశంసనీయమైనా, ముఖ్యమంత్రిగా చంద్ర బాబు నాయుడు రాష్ట్రాన్ని సమదృష్టితో చూడాలని కరువు పీడిత ప్రాంతంగా దేశవ్యాప్త గుర్తింపు పొందిన అనంతపురం జిల్లాకు మొదటి ప్రాధాన్యతగా సాగు నీరు అందించాల్సిన సందర్భంలో ఆగమేఘాల మీద కుప్పం నియోజకవర్గానికి నీరు ఇవ్వడాన్ని కళ్యాణదుర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య తీవ్రంగా ఆక్షేపించారు. చంద్రబాబు నాయుడు కుప్పంకు మాత్రమే ముఖ్యమంత్రినని అనుకుంటున్నట్లు వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. గురువారం కుందుర్పి మండల పర్యటనలో భాగంగా మహంతాపురం సమీపంలో ఆగిపోయిన కుందుర్పి బ్రాంచ్ కెనాల్ వెంట రెండు కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా ఉన్న సురేంద్రబాబుకు చెందిన ఎస్సార్ కన్స్ట్రక్షన్ కంపెనీ కుందుర్పి బ్రాంచ్ కెనాల్ కాలువల ద్వారా 114 చెరువులకు సాగునీరు అందించే కాంట్రాక్టును 2018 లోనే తీసుకున్నారని, కాలువలకు భూములు ఇచ్చిన రైతులకు వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పరిహారం మినహాయిస్తే, మిగిలిన వారికి టిడిపి ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదని మండి పడ్డారు. అయితే కళ్యాణదుర్గం ఎమ్మెల్యేకు చెందిన నిర్మాణపు సంస్థ కుప్పం నియోజకవర్గం సాగునీరు అందించేందుకు 150 యంత్రాలతో వేగంగా పనులు చేసినట్లు వీడియోల ద్వారా ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కరువు జిల్లాగా పేరు ఉన్న అనంతపురం ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా భూగర్భ జలాలు భూమిలోకి ఇంకిపోకుండా కుప్పం కాలువలకు లైనింగ్ చేసి వేగంగా నీటిని తీసుకువెలుతుంటే ఆక్షేపించక పోవడం దురదృష్టకర మన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు రెండున్నర సంవత్సరాలలో బి టి పి కుందుర్పి బ్రాంచ్ కెనాల్ పనులను పూర్తి చేస్తానని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే హామీ చెప్పినా, తాను పాదయాత్ర చేస్తానంటే హడా వుడిగా బ్రహ్మసముద్రం మండలంలో మట్టి తవ్వకాలు ప్రారంభించారని మండి పడ్డారు. ఆ పనులు కూడా మట్టిని ఇతర ప్రాంతాలకు తీసుకొని వెళ్లేందుకు తవ్వకాలే గాని కాలువల కోసం కాదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాలువలను నిర్మించాలని, 114 చెరువులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతా రైతులు కూడా చైతన్యవంతులై ప్రశ్నించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరు ప్రశ్నించకపోయినా తమ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

## వాడవాడలా వినాయక విగ్రహాలకు పూజలు




పట్టణంలో వెలసిన వినాయక విగ్రహాలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 28 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం పట్టణంలో వినాయక చవితి పండుగ సందర్భంగా వాడవాడలా కాలనీలో వినాయక విగ్రహాన్ని వివిధ రూపాలలో ప్రతిష్టించి చిన్నపిల్లల దగ్గర నుండి పెద్దవారి దాకా కలిసికట్టుగా వినాయక చవితి వేడుకలను జరుపుకున్నారు. విద్యానగర్లో ప్రతిష్టించిన వినాయక మండపాన్ని స్థానిక ఎమ్మెల్యే సురేంద్రబాబు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా మహిళలతో కలిసి కోలాటం పాడుతూ సందడి చేశారు. ఇదిలా ఉండగా వినాయక మండపాలలో ప్రత్యేక అలంకరణలతో శ్రీ వినాయకుని వివిధ రూపాలలో ప్రతిష్టించిన నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండపాలు బొజ్జ గణపయ్య పాటలతో సందడిగా కనిపించాయి. పట్టణ ప్రజలు కూడా కాలనీలో వెలసిన వినాయక విగ్రహాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## మండపాల్లో కొలువుదీరిన గణనాథులు

కంబదూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త



ఎస్సీ కాలనీలో కొలువు దీరిన బొజ్జ గణపయ్య దృశ్యం

వినాయక చవితి పర్వ దినాన్ని పురస్కరించుకొని కంబదూరు మండల కేంద్రం చెక్ పోస్ట్ ఎస్సీ కాలనీలో యువ వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో బుధవారం బొజ్జ గణపయ్య కొలువుదీరాడు. ఈ సంద ర్భంగా గణపతి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు .అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. చెక్ పోస్ట్ ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం ఆకర్షణగా నిలుస్తుంది. వైయస్సార్ సర్కిల్, పాత మార్కెట్, పుట్టన్న గారి వీధి, బాగేపల్లి వీధి, కోట, ఓల్డ్ ఎస్సీ కాలనీ, గుండ్లపల్లి తదితర కాలనీల్లో గణనాథుడు కొలువుదీరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నవోదయ పాఠశాలను తిమ్మాపురంలో నిర్మించండి



ఎమ్మెల్యే సురేంద్ర బాబుకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

కంబదూరు, ఆగస్టు 28 , ప్రభాతవార్త

కళ్యాణదుర్గం నియోజక వర్గానికి జవహర్ నవోదయ పాఠశాల మంజూరు అయిన సందర్భంలో , ఆ పాఠశాల ఏర్పాటుకు కంబదూరు మండలం లోని తిమ్మాపురం గ్రామంలో కోట్లాది రూపాయలు విలువ కల్గిన ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ భూములు ఉన్నాయని , కనుక ఆ గ్రామంలో నవోదయ స్కూల్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని బుధవారం కళ్యాణదుర్గం పట్టణం లోని ప్రజా వేదిక వద్ద ఎంఎల్‌ఏ అమిలినేని సురేంద్ర బాబు కు అర్జీ రూపంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ పైడిపాటి నరసింహయ్య సతీమణి , మాజీ జడ్పీ మెంబర్ హనుమ కుమారి విన్నవించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ చౌదరి, నరేష్ చౌదరి, సుధాకర్ , స్కూల్ చైర్మెన్ వీరాంజనేయులు, మారుతి ప్రసాద్, గంగ ,మూర్తి పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అమ్మవారి వేడుకల్లో పాల్గొన్న వాల్మీకి సంఘం అధ్యక్షులు



అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొన్న వాల్మీకి సంఘం అధ్యక్షులు

డి.హిరెహాళ్ ఆగస్టు 28 ప్రభాతవార్త

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప ఆ సంక్షేమ సేవా సమితి ఉపాధ్యక్షుడు మలకన్న, సభ్యులు, మిత్రులతో కలిసి గ్రామదేవతలు అమ్మవార్ల ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేయించారు. బుధవారం రాయదుర్గం పట్టణంలోని కోటమారెమ్మ, దండు మారెమ్మ, బయటపేట పెద్ద మారెమ్మ అమ్మవార్ల కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. కోట మారెమ్మ, దండు మారెమ్మ అమ్మవార్ల ఆలయాల వద్ద నిర్వహించిన సిడి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేయించి కొబ్బరికాయలు కొట్టి సిడి మహోత్సవ వేడుకలను ప్రారంభించారు. ప్రతి ఏటా ఆనవాయితీగా భద్రపద మాసంలో రాయదుర్గం ప్రాంతంలో ని ప్రజలు భక్తిశ్రద్ధలతో అమ్మవార్ల మహోత్సవ వేడుకలు నిర్వహించి అమ్మవార్లకు మొక్కుబడులు తీర్చుకుంటూ కానుకలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సిడి మహోత్సవ వేడుకలకు సరిహద్దున ఉన్న కర్ణాటక ప్రాంతాలు చిత్రదుర్గ, బళ్లారి, శివమోగా జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, బోయపాటి ప్రకాష్, కోడగల్ రుద్ర, సహాయ కోశాధికారి పైతోట రఘు, మాజీ కౌన్సిలర్ తిప్పేస్వామి, సత్తి, సిద్దలింగప్ప, తిప్పేస్వామి, పైతోట శ్రీనివాస్, పైతోట రాము, బయట పేట గాదిరి, హమాలీ బండి నాగరాజు మిత్రుడు విశ్రాంతి ఉద్యోగి వల్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

డి.హిరెహాళ్ ఆగస్టు 28 ప్రభాతవార్త



పతిజ్ఞ చేస్తున్న సిపిఎం నాయకులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని పాత మీటర్లు ఉండే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎన్ లోకేష్ డిమాండ్ చేశారు. గురువారం డి.హిరెహాళ్ మండ ల కేంద్రంలోని విద్యుత్ అమర వీరులకు నివాళులర్పిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 2000వ సంవత్సరంలో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ముగ్గురు అమరుకులె 25 సంవత్సరాల అయిందన్నారు. ఆ ఉద్యమం ఫలితంగా దాదాపు 2 దశాబ్దాల పాటు విద్యుత్ చార్జీల పెంపుకు ఏ ప్రభుత్వం సాహసించలేదని ఆయన పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం సంస్కరణల పేరుతో ప్రజలపై వేసిన వేలాది కోట్ల రూపాయల భారంను రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అదే విధానాలను కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆగష్టు 28న ప్రతిజ్ఞ దినంగా పాటించాలని సిపిఎం పార్టీ పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దన్న, రుద్రయ్య, గోవిందా, ఆంజనేయ, ఉల్లిగప్ప, కృష్ణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు క్రీడా సామాగ్రి వితరణ



క్రీడా సామాగ్రిని వితరణ చేస్తున్న దృశ్యం

బెలుగుప్ప, ఆగస్టు 28 ప్రభాతవార్త

బెలుగుప్ప మండల పరిధిలో కోణంపల్లి ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి స్వరూప డా/ఆఫ్ రామ్‌దాస్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు నాయక్‌కు 10 సెటిల్స్, కాక్‌లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి మాట్లాడుతూ.. పాఠశాలకు సంబంధించిన మరికొన్ని క్రీడా సామాగ్రిని కూడా పంపిణీ చేస్తానని, ఈ పాఠశాలకు తనవంతు సహాయం చేస్తానని తెలిపారు. అందులో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రీడా సామాగ్రిని అందజేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ వన్నూరుస్వామి, ఉపాధ్యాయులు సాయిప్రసాద్, బ్రహ్మానందరెడ్డి, సూర్యనారాయణ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## అధికార బలంతో గిరిజనులపై దాడులు సరికాదు



రామ్లానాయక్‌ను పరామర్శిస్తున్న శ్రీనివాసులు నాయక్

గుంతకల్లు, ఆగస్టు 28 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వంలో అధికార బలంతో గిరిజనులపై దాడులు సరికాదని వైఎస్ఆర్‌సిపి ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులునాయక్ అన్నారు. గత ఐదు రోజుల క్రితం మండలంలోని పులుగుట్టపల్లి పెద్ద తండాకు చెందిన రామ్లానాయక్ దంపతులపై గుర్తుతెలియని దుండగులు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గురువారం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామ్లానాయక్‌ను ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గిరిజనులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం మంచిది కాదని, రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొనకొండ్ల అంజి, నాగరాజునాయక్, సాకే ప్రకాష్, దాసునాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మట్కా బీటరు అరెస్టు

వజ్రకరూరు ఆగస్టు 28 ప్రభాతవార్త

మండలంలోని గూళ్యపాల్యం గ్రామంలో మట్కా స్థావరంపై దాడి చేసి మట్కా బీటర్ ను అరెస్టు చేసినట్లు ఎస్ ఐ నాగ స్వామి తెలిపారు. గ్రామ శివారులోని ముళ్ళ పొదల వద్ద చాకలి నాగేంద్ర మట్కాస్థావరాన్ని ఏర్పాటు చేసుకొని మట్కా నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు కాపు కాచి నిందితుడిని అరెస్టు చేసి 11300 రూపాయలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లుఆయన తెలిపారు.

## గణేష్ నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించుకోవాలి : డిఎస్‌పి శ్రీనివాస్



నిమజ్జనం చేసే ప్రాంతాలను పరిశీలిస్తున్న డిఎస్‌పి

గుత్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త

మతసామరస్యానికి ప్రతీకగా ప్రజలు గణేష్ నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని గుంతకల్లు డిఎస్‌పి శ్రీనివాస్ సూచించారు. గురువారం ఆయన స్థానిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, అనంతరం మండపాలను పరిశీలించారు. తదుపరి శుక్రవారం జరగనున్న నిమజ్జన ప్రాంతాలను పరిశీలించారు. గుత్తి చెరువుతో పాటు, తుర్కపల్లి రోడ్డు కుంట, సూరసింగనపల్లి చెరువు, లచ్చానుపల్లి ఉప్పొంక, పత్తికొండ రోడ్డులో వున్న వంకలను పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులతో చర్చించారు. మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 177 వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్, కమీషనర్ జబ్బార్‌మియా, తహశీల్దార్ పుణ్యవతి,ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వాడవాడలా వెలసిన వినాయకుడు



టెంకాయలతో గణపతిని తయారు చేసిన దృశ్యం

గుత్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త



గుత్తి ఇన్‌చార్జ్ ఈశ్వర్ ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

గుత్తి, గుత్తి ఆర్‌ఎస్ పట్టణాలతో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లో వినాయకచవితి వేడుకలను ఘనంగా నిర్వ హించుకున్నారు.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దాదాపుగా 200 విగ్రహాలను ఏర్పాటు చేశారు. పలు గణేష్ మండపాల్లో టిడిపి గుత్తి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, ప్రత్యేక ప్రార్థనలు గావించారు. కెపిఎస్ ఎవెన్యూలో వినాయకుడికి అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు గావించారు. రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద కార్మికులు 1661 టెంకాయలతో రూపొందించిన వినాయకున్ని డిజల్ షెడ్ సీనియర్ డిఎంఇ ప్రమోద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి గంట నరహరి పలు మండపాల్లో పూజలు చేశారు. పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వాణిజ్య ప్రాంతాలు కిటకిటలాడాయి. పండుగ వాతావరణం సందడిగా నెలకొంది. కాగా శుక్రవారం గణేష్ నిమజ్జనానికి అధికారులు ఐదు ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు.

## జెడ్‌పి విద్యార్థికి ప్రథమ బహుమతి

గుత్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త



బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

ప్రభుత్వం పొగాకు వినియోగాన్ని నిర్మూలించేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమంలో కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి యశ్వంత్ ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆ విద్యార్థి పెద్దసంఖ్యలో సంతకాల సేకరణ చేశాడు. గురువారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం సుబహాన్ విద్యార్థికి బహుమతి ప్రదానం గావించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అమరవీరులకు ఘన నివాళులు



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

గుత్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త

విద్యుత్ చార్జీల తగ్గింపుకై నిర్వహించిన ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు గురువారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. 2000 సంవత్సరంలో బషీర్బాగ్ వద్ద పోలీసుల కాల్పుల్లో మృతి చెందిన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి నిర్మల, రామకృష్ణ, మల్లికార్జున, అశోక్, చందు, ప్రశాంత్, జయమ్మ, సావిత్రి, పార్వతి, రంగస్వామి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తాం

-మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణస్వామి

గుంతకల్లు, ఆగస్టు 28 ప్రభాతవార్త

మండలంలోని శ్రీబుగ్గ సంగమేశ్వర దేవాలయం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి అన్నారు. గురువారం దేవాలయ ధర్మకర్తల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత పాలకులు ఆలయ అభివృద్ధిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చొరవతో ఆలయ అభివృద్ధికి సంబంధించిన కమిటీని నియమించడం జరిగిందన్నారు. కమిటీ సభ్యులు అభివృద్ధికి సహకరించాలని కోరారు. చైర్మన్‌గా ఎస్.ఈశ్వరయ్య, ధర్మకర్తలుగా లాలిరెడ్డి, సుబ్బన్న, గంగమ్మ, ప్రకాష్‌రావు, అరుణ, సునితాబాయి, శ్రీనివాసులు, మంజునాథ్‌ల చేత ఎండోమెంట్ అధికారిని రాణి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు, నాయకులు తలారి మస్తానప్ప, గుమ్మనూరు వెంకటేష్, ఫజులు, ఆలయ ఈఓ ఎ.క్రిష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## జైనబ్బీ దర్గాను సందర్శించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

-ప్రత్యేక ప్రార్థనలు, సన్మానించిన దర్గా కమిటీ బాధ్యులు



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిను సన్మానించి ప్రసాదాన్ని అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ, ఆగస్టు 28 ప్రభాతవార్త

పట్టణంలోని హిందూ, ముస్లింల మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న బీబీ జైనబ్బీ అమ్మవారి దర్గాను బుధవారం రాత్రి ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి సందర్శించారు. ఈనెల 20, 21, 22 తేదీల్లో బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన దర్గాను సందర్శించి బీబీ జైనబ్బీ అమ్మవారి సమాధిపై చాదర్‌కప్పి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దర్గా అభివృద్ధిపై కమిటీ బాధ్యులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిను శాలువాకప్పి పూలమాలతో సన్మానించి ప్రసాదాన్ని అందించింది. తొలుత ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి స్థానిక లక్ష్మీనరసింహ కాలనీలో మోండి శ్రీకాంత్, పులివెందుల రమేష్ ఆహ్వానం మేరకు వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు హోతూరు బాషా, ఉపాధ్యక్షులు బ్యాళ్ళ ప్రసాద్ తదితరులతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు రేణిమాకులపల్లి రామాంజినేయులు, బి.విజయ్ కుమార్, చిన్నముష్టూరు ఎర్రిస్వామి, హెచ్.బసవరాజు, పాల్తూరు మాలింగ, జిలాన్, వెలిగొండ బుషప్ప, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## 26 మంది లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ సాయం

-చెక్కులు అందజేసిన టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న వారితో పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, ఆగస్టు 28 ప్రభాతవార్త

ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు, బెలుగుప్ప మండలాలకు చెందిన 26 మంది లబ్దిదారులకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు 16,66,313 రూపాయలు చెక్కులను గురువారం పంపిణీ చేశారు. రాష్ట్ర ఆరి ్థక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ సాయం మంజూరుకాగా జిల్లా కేంద్రం అంతపురంలో ఆయన లబ్దిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందినవారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందిస్తున్న ఈ సాయం ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందన్నారు.

## భక్తి భావమే ముక్తికి మార్గం

-ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి



గవిమఠ సంస్థానం తొలి పీఠాధిపతి జగద్గురు కర్తృ కరిబసవరాజేంద్రస్వామి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి

ఉరవకొండ, ఆగస్టు 28 ప్రభాతవార్త

భక్తి భావమే ముక్తికి మార్గమని ప్రతిఒక్కరూ, పెద్దలు, గురువులపట్ల భక్తిభావంతో మెలగాలని గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి అన్నారు. పట్టణంలోని ప్రసిద్ధ గవిమఠ సంస్థాలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం శ్రావణశుద్ధ పంచమి నుండి కర్నూల్ జిల్లా విరుపాపురం శంకరాచార్య మఠం ప్రవచనకర్త హనుమంతప్పచే కొనసాగిన గవిమఠం సంస్థానాదీశులు జగద్గురు కర్తృ కరిబసవరాజేంద్రస్వామి జీవిత చరిత్ర పురాణ ప్రవచన కార్యక్రమం భాద్రపద పంచమి గురువారం వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా ఉదయం ఉత్తరాధికారి జగద్గురు కరిబసవరాజేంద్ర ఆధ్వర్యంలో గవిమఠం సహాయ కమీషనర్ కె.రాణి పర్యవేక్షణలో తొలి పీఠాధిపతి కర్తృ కరిబసవస్వామి జీవ సమాధికు రుద్రాభిషేకం, గరు శతనామావళి, బిల్వార్చన, మహామంగళహారతి కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం గవిమఠం ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగద్గురు కర్తృ కరిబసవస్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించిన అనంతరం ప్రవచనకర్త హనుమంతప్ప తదిరులను ఉత్తరాధికారి శాలువాకప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి మాట్లాడుతూ మఠాదీశులైన కర్తృ కరిబసవరాజేంద్రస్వామి గొప్ప మహిమాన్వితులైన దైవసమానులని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను తెలుసుకున్నవారి జీవితాలు పరిపూర్ణమవుతాయని ఆయన చూపిన మార్గంలో పయణించి జీవితాలను సార్థకం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సంక్షేమ సంఘం బాధ్యులు, భక్తులు, మఠం సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టండి

వజ్రకరూరు ఆగస్టు 28 ప్రభాతవార్త



వీధిలో నిలిచిన వర్షపు నీరు

మండల కేంద్రంలోని మెయిన్ బజార్ పరిసర ప్రాంతలలో వర్షపు నీరు నిలిచి రాకపోకలు సాగించడానికి ఇబ్బందికరంగా మారింది. నీరు ముందుకు కదలక నాలుగైదు రోజులు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుంది. దీన్ని తట్టుకోలేక స్థానికులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటున్నారు. అధికారులకు దృష్టికి తీసుకు వెళ్లిన సమస్యను పరిష్కరించడంలేదని వాపోతున్నారు. అధికారులు కేవలం సమస్యను పరిశీలించాం, పరిష్కరిస్తాం, ఫోటోలు దిగి వెళ్తున్నారంటూ సామాజిక మద్యమాలలో పోస్టులు పెడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలికంగా కాలును ఏర్పాటు చేసి నీరు నిలవకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్ గడువు పొడగింపు

ధర్మవరం రూరల్ ఆగస్టు28 ప్రభాతవార్త

డిగ్రీ ఆన్లైన్ ప్రవేశాల రిజిస్ట్రేషన్ గడువును ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు సెప్టెంబరు 1 వరకు గడువు పొడిగించడం జరిగిందని ప్రభుత్వ కే హెచ్. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు గడువును ప్రభుత్వం పొడిగించింది అని పట్టణంలోని స్థానిక కే.హెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 202526 విద్యా సంవత్సరగాను డిగ్రీ బి.ఎ., బి.కాం., బి.ఎస్సీ మొదటి సంవత్సరం చేరదలచిన విద్యార్థులకు అడ్మిషన్ కౌన్సిలింగ్ పొడిగించారని, ఈ నెల సెప్టెంబర్ 1 వ, తేదీ లోపు విద్యార్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవలసి వుంటుందని, ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన సెప్టెంబర్ నెల 1 వ, తేదీ నుండి 3 వరకు నిర్వహించబడుతుంది అని తెలిపారు.

